విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 సంచిక : 332 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ శుక్రవారం 24 ఏప్రిల్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## శబరిమల కేసులో 'వాట్సాప్' సెటైర్లు

- మత విశ్వాసాలు రాజ్యాంగ నైతికతకు లోబడే ఉండాలి..
- 9 మంది సభ్యుల ధర్మాసనం స్పష్టం
- సోషల్ మీడియా సమాచారంపై సర్వోన్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు

2





## మేడ్ ఇన్ తెలంగాణ గ్లోబల్ బ్రాండ్!

ములుగులో బేకర్ హ్యూస్ తయారీ కేంద్రం ప్రారంభం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం

2

## నేటి నుంచే వేసవి సెలవులు!



- జూన్ 11 వరకు విద్యాసంస్థలకు వేసవి విరామం
- జూన్ 12న తిరిగి తెరుచుకోనున్న పాఠశాలలు
- ఆర్టీసీ సమ్మెతో నిలిచిన పల్లె పయనాలు

2

## సీఎం రేవంత్ మాట తప్పారు!

- ఆర్టీసీ సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు
- కేసీఆర్, రేవంత్ ఇద్దరూ ఒక్కటే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



2



## బీజేపీదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

2

## తమిళనాడు, బెంగాల్‌లో తొలిదశ పోలింగ్ ప్రశాంతం



- బెంగాల్‌లో 89.93 శాతం..
- తమిళనాడులో 82.24 శాతం
- మే 4న తుది ఫలితాలు

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి అంకం ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఈవీఎంలలో నిక్షిప్తమైంది.

2



## 11 మంది సజీవదహనం!

అదుపుతప్పిన ట్రక్కు.. ముక్కలైన వాహనాలు

ఎగిసిపడిన నిప్పురవ్వలు

2

## సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షుల్ని చంపాలని చూస్తున్నారు

- అనంతబాబు నేరాల్ని ప్రోత్సహించింది జగన్‌రెడ్డే
- పెద్ద దస్తగిరి హత్యలోనూ వైకాపా పెద్దతలల పాత్ర
- దళితుల్ని చంపించడం, వారి ఆస్తులు లాక్కోవడం జగన్ తాతముత్తాల నుంచీ వస్తున్నదే
- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి ధ్వజం



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షుల్ని చంపినట్టే డ్రైవర్ సుబ్రహ్మణ్యం కేసులోనూ చేయాలని చూస్తున్నారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆరోపించారు. పేదలు, దళితుల్ని చంపించడం, వారి ఆస్తులు, భూముల్ని లాక్కోవడం వైకాపా అధినేత జగన్ తాతముత్తాల నుంచీ వస్తోందేనని దుయ్యబట్టారు. జగన్ నేర చరిత్రలో వైఎస్ వివేకానందరెడ్డి, పెద్ద దస్తగిరి ఇలా ఎన్నో హత్యలున్నాయని విమర్శించారు. గురువారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సంధ్యారాణి విలేకర్లతో మాట్లాడారు.

- మిగతా2లో





# విద్యుత్తు ఛార్జీలు పెంచం

- విశ్వాసానికి మారుపేరు ఏపీ
- ఇదే ఎన్డీయే బ్రాండ్
- ప్రజా ప్రభుత్వంలో రోజూ పెట్టుబడుల పండుగే
- 2024లో వేసిన ఒక్క ఓటుతో మీ రాత మారిందా.. లేదా?
- రెన్యూ ప్రాజెక్టు శంకుస్థాపనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**2019-24 మధ్య పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారు. అవినీతి, వేధింపులు పెరిగిపోయాయి. విశ్వాసం ఉన్నచోటే పరిశ్రమలొస్తాయి. ఆ విశ్వాసానికి మారుపేరు, చిరునామా ఆంధ్రప్రదేశ్. ఇదే ఎన్డీయే బ్రాండ్. ఉద్యోగాల కోసం బయట రాష్ట్రాలకు వెళ్లక్కర్లేదు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు ఉద్యోగాలకు వచ్చేలా చేసే బాధ్యత మాది. సీఎం చంద్రబాబు**

'2019-24 మధ్య విద్యుత్తు రంగం కుప్పకూలిపోయింది. పీపీఏలు రద్దుచేశారు. అధిక ధరలకు విద్యుత్తు కొనడం, అవినీతి, అనాలోచిత నిర్ణయాలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. విద్యుత్తు సంస్థలపై రూ.1.12 లక్షల కోట్ల భారం మోపారు. తొమ్మిదిసార్లు ఛార్జీలు పెంచారు. ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం వేశారు. విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో చెప్పిన మాట నిలబెట్టుకుంటున్నాం. గత ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలు పెడితే.. కూటమి వచ్చాక ట్రూ డౌన్ చేసి యూనిట్‌కు 13 పైసల చొప్పున రూ.4,498 కోట్లు తగ్గించాం. అధికారంలోకి వచ్చిన 22 నెలల్లో 1.13 కోట్ల గృహ వినియోగదారులకు ఒక్క పైసా పెంచలేదు. భవిష్యత్తులోనూ విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యూ ఎనర్జీ

- మిగతా2లో

## జగన్ తెచ్చిన పరిశ్రమలకు చంద్రబాబు శంకుస్థాపనలు..

'క్రెడిట్ చోరీ'లో బాబుకు సాటిలేరు

మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఘాటు విమర్శలు



అనకాపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి తన పాత 'క్రెడిట్ చోరీ' అలవాటును బయటపెట్టుకున్నారని మాజీ మంత్రి, వైయస్ఆర్‌సీపీరీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ ఎద్దేవా చేశారు. అనకాపల్లి జిల్లాలో గురువారం 'రెన్యూ సోలార్' సంస్థకు సీఎం చేసిన శంకుస్థాపనపై ఆయన స్పందిస్తూ..

- మిగతా2లో

## బిట్స్ అమరావతి క్యాంపస్‌లో 2027 నుంచి ప్రవేశాలు

సీఎంకు వివరించిన సంస్థ ప్రతినిధులు



రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) క్యాంపస్‌లో 2027 నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని ఆ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. గురువారం సచివాలయంలో సీఎంను కలిసి బిట్స్ అమరావతి క్యాంపస్ పురోగతిని వారు వివరించారు. అమరావతి క్యాంపస్‌లో క్వాంటమ్,

- మిగతా2లో

# విద్యుత్తు ఛార్జీలు పెంచం

-మొదటిపేజీ తరువాయి

గ్లోబల్ సంస్థ ఏర్పాటుచేస్తున్న సోలార్ ప్యానెళ్ల తయారీ ప్లాంటు, ఇంగోట్ వేఫర్ ఉత్పత్తి యూనిట్‌కు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. 'సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెన్యూ ఎనర్జీ ఎంఓయూ చేసుకుని రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఇప్పుడీ పరిశ్రమతో రాంబిల్లిలో 2,100 మందికి ప్రత్యక్ష ఉపాధి కలుగుతుంది. దేశంలోనే అత్యంత ధనిక జిల్లాగా పేరుపొందిన రంగారెడ్డి జిల్లాను మించి అనకాపల్లి ఎదుగుతుంది. సోలార్ ఇంగోట్ వేఫర్ ఉత్పత్తితో మనం విదేశాలపై ఆధారపడే పరిస్థితి పోతుంది. ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ కల సాకారానికి ఇదే నిదర్శనం' అన్నారు. 'కేంద్రం 500 గిగావాట్ల విద్యుత్తును క్లీన్ ఎనర్జీలో లక్ష్యంగా పెట్టుకుంటే, రాష్ట్రంలో 160 గిగావాట్లు ఉత్పత్తి చేయబోతున్నాం. దీనివల్ల రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఇప్పటికే 90 గిగావాట్లకు మంజూరు, ఎంఓయూలు చేశాం. 22 నెలల్లో 117 ప్రాజెక్టులు ఆమోదించాం. వీటివల్ల రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు, 4.76 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. భవిష్యత్తులో అన్నీ విద్యుత్ వాహనాలుండాలి. త్వరలోనే ఆర్టీసీలో 1,050 ఈవీ బస్సులు తెస్తున్నాం. రాబోయే మూడేళ్లలో 5వేల ఛార్జింగ్ స్టేషన్లు, ఆర్టీసీలో అన్నీ విద్యుత్ బస్సులే వస్తాయి. అందరూ సహకరిస్తే ఆర్టీసీలో అన్నీ ఏసీ బస్సులు పెడతాం' అని చంద్రబాబు తెలిపారు.

**ప్రతి ఇల్లూ విద్యుదుత్పత్తి కేంద్రం కావాలి**

'రాష్ట్రంలో ప్రతి ఇంటినీ ఒక విద్యుదుత్పత్తి కేంద్రంగా తయారుచేయాలి. రైతులు పంపుసెట్ల వద్ద విద్యుదుత్పత్తి చేసుకోవాలి. రాబోయే రెండు, మూడేళ్లలో 40 లక్షల ఇళ్లపై సోలార్ యూనిట్లు పెట్టే బాధ్యత తీసుకుంటాం. ఎస్సీ, ఎస్టీలకు రూ.60 వేల విలువైన 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ఉచితం. బీసీలకు రూ.98వేలు, ఇతరులకు రూ.78వేల చొప్పున 3 కిలోవాట్ల వరకు ఉచితంగా ఇస్తాం. ఆపైన ఖర్చు మీరు పెట్టుకోవాలి' అని సీఎం వివరించారు.

**ఏది విధ్వంసం? ఏది వికాసం?ప్రజలు తెలుసుకోవాలి**

'22 నెలల క్రితం ఉత్తరాంధ్రలో ఎటు చూసినా అభద్రత, భయం, ఆందోళన, మానసిక క్షోభ ఉన్నాయి. 2024లో మీరు వేసిన ఒక్క ఓటుతో మీ రాత మారిందా.. లేదా? అని అడుగుతున్నా. ఉత్తరాంధ్రలో నాడు పొక్లెయిన్లతో కూల్చివేతలు జరిగితే.. నేడు వాటితో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రకృతి వనరులను దోచిన పాలకులకు.. వాటిని సంపదగా మార్చే ప్రభుత్వాలకు మధ్య తేడా గుర్తించాలి. ఏది విధ్వంసమో.. ఏది వికాసమో తెలుసుకోవాలి. ప్రజా ప్రభుత్వంలో ఉత్తరాంధ్రలో రోజూ పెట్టుబడుల పండగ జరుగుతోంది. విశాఖకు ఈ నెల 28న గూగుల్ వస్తోంది. భోగాపురం విమానాశ్రయాన్ని జులై మొదటి వారంలో ప్రారంభిస్తాం. వర్షాలు పడగానే గోదావరి నీళ్లను ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ఇక్కడకు తెస్తున్నాం. మోదీ మద్దతుతో విశాఖ ఉక్కును కాపాడాం. రైల్వేజోన్‌ను త్వరలోనే ప్రారంభిస్తాం. విశాఖ లాగే.. రాజధాని అమరావతి దశ, దిశ మార్చబోతున్నాం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**పీ4లో భాగస్వాములు కండి**

రెన్యూ గ్రూప్ సీఎస్ఆర్ కింద చేసిన కార్యక్రమాల చిత్రాలను వేదిక వద్ద ఏర్పాటుచేశారు. వాటి గురించి సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా, కోఫౌండర్ వైశాలి నిగమ్ సిన్హా వివరిస్తుండగా... 'సీఎస్ఆర్ అంటే గుర్తొచ్చింది' అంటూ సీఎం చంద్రబాబు పీ4 పథకం గురించి చెప్పారు. అదానీ ఏపీలో 25వేల కుటుంబాలను దత్తత తీసుకున్నారని, అలాగే రెన్యూ సంస్థ భాగస్వామ్యం కావాలని కోరారు.

**రెన్యూ సోలార్ కంపెనీ ఛైర్మన్ సుమంత్ సిన్హా**

'సౌరవిద్యుత్తుకు ఏపీని కేంద్రంగా మారుస్తాం. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటుచేసి.. స్థానికులకు 20% ఉపాధి కల్పిస్తాం' అని రెన్యూ సోలార్ కంపెనీ ఛైర్మన్ సుమంత్ సిన్హా తెలిపారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో సోలార్ ప్లాంట్ ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ఇప్పటికే గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో యూనిట్లున్నా ఏపీలోనే రూ.82 వేల కోట్ల పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించాం. రాష్ట్ర ప్రభుత్వం స్నేహపూర్వక విధానాలు, పరిశ్రమలను ఆహ్వానించే చర్యలు ఆకట్టుకుంటున్నాయి. ఆరు నెలల్లోనే ఇక్కడ యూనిట్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించి అనుమతులు మంజూరుచేశారు. సెమీకండక్టర్, సోలార్ ప్యానెల్ తయారీకి ఉపయోగించే సిలికాన్ మెటీరియల్ ఇక్కడ ప్లాంట్‌లో తయారుచేస్తాం. దీనికి అనుబంధంగా పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయనున్నాం. రాంబిల్లి యూనిట్ కోసం రూ.4,200 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాం. దీనివల్ల 2,400 మందికి ఉపాధి లభిస్తుంది. 2030 నాటికి 6.5 గిగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా పనిచేస్తాం. అమెరికా అనుబంధ పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని ఎక్కువగా వినియోగిస్తాయి. సమీపంలో గూగుల్ రావడంతో మా ప్లాంట్‌కు ఎక్కువ డిమాండ్ ఉంటుందని భావిస్తున్నాం' సుమంత్ సిన్హా పేర్కొన్నారు.

# బెంగాల్లో బీజేపీదే విజయం

కోల్కతా, ఏప్రిల్ 23: బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్లో లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాలుఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచచ్చారు..

ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డీఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు.

దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

# సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షుల్ని చంపాలని చూస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

'సుబ్రహ్మణ్యం హత్యలో కీలక నిందితుడైన అనంతబాబు ఎమ్మెల్సీగా కొనసాగడం సిగ్గుచేటు. వైకాపా ప్రభుత్వంలో జగన్ కనుసన్నల్లో నడుచుకున్న పోలీసులు ఉద్దేశపూర్వకంగానే ఈ కేసును నీరుగార్చారు. మృతుడి శరీరం మీద 31 గాయాలున్నా హత్యగా నమోదు చేయకుండా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కూటమి అధికారం చేపట్టాక సుబ్రహ్మణ్యం హత్యకు సంబంధించిన 60 వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దళిత యువకుడి హత్య నుంచి తప్పించుకోవడానికి అనంతబాబు కుట్రలు చేస్తున్నారు. అబద్ధపు సాక్ష్యం చెప్పాలంటూ సాక్షులకు డబ్బు ఎర వేస్తున్నారు. లొంగనివారిని బెదిరిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీల్ని బలహీనులని తక్కువ అంచనా వేస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సొంత కుటుంబమే జగన్‌ను చీదరించుకుంటోంది**

సొంత కుటుంబమే జగన్‌ను చీదరించుకుంటోందని సంధ్యారాణి ఎద్దేవా చేశారు. 'తల్లిని, సొంత చెల్లినే జగన్ ఇంట్లోంచి తరిమేశారు. తన కారు కింద వైకాపా కార్యకర్త పడితే ఆపకుండా వెళ్లిపోయి అతడి మరణానికి కారణమయ్యారు. బాబాయ్ వివేకానందరెడ్డిని హత్య చేయించి దాన్ని గుండెపోటుగా చిత్రీకరించారు. సాక్ష్యాలు తారుమారు చేసి ప్రజలు, పోలీసుల్ని తప్పుదారి పట్టించాలని చూశారు. ఆ హత్య కేసులో సాక్షులు ఒక్కొక్కరుగా మరణించడం వెనుకా పలు అనుమానాలున్నాయి' అని సంధ్యారాణి పేర్కొన్నారు.

**జగన్‌ను నమ్మి జీవితాలు నాశనం చేసుకోవద్దు**

'కోడికత్తి కేసులో దళిత యువకుడు శ్రీను పరిస్థితిని వైకాపా కార్యకర్తలు ఒకసారి గుర్తుచేసుకోవాలి. పార్టీ కోసం నేరం చేసి ఏళ్ల తరబడి అతను జైల్లో మగ్గిపోయినా జగన్ కనీసం పట్టించుకోలేదు. ఇప్పుడు మీరు రప్పా రప్పా అని ప్లకార్డులు పట్టుకుని జైలుకెళ్లినా జగన్ మీ కోసం ఏమీ చేయరు. అనవసరంగా మీ జీవితాలు నాశనం చేసుకోవద్దు' అని వైకాపా కార్యకర్తలకు మంత్రి హితవు పలికారు. అమ్మ, అమరావతి, ఆంధ్రప్రదేశ్ అంటే జగన్‌కు గౌరవం లేదని సంధ్యారాణి వ్యాఖ్యానించారు.

**వైకాపా పాలనలో తీవ్రంగా నష్టపోయింది ఎస్సీ, ఎస్టీలే**

అనంతబాబు నేరాల్ని జగన్‌రెడ్డే ప్రోత్సహించారని, సుబ్రహ్మణ్యం హత్య తర్వాత కూడా అతనిపై చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనమని మంత్రి విమర్శించారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీలపై కపట ప్రేమ ప్రదర్శించే జగన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక తన నిజస్వరూపం బయటపెట్టారు. ఆయన పాలనలో బడుగు, బలహీనవర్గాలు తీవ్రంగా నష్టపోయాయి. న్యాయం కోసం ఎక్కడికెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. వైకాపా నాయకుల వేధింపులు తాళలేక కొందరు ఆత్మహత్య చేసుకున్నారు.

వైకాపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినా, సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేసినా కేసులు పెట్టారు. మాస్కు అడిగిన పాపానికి దళిత వైద్యుడ్ని చంపేశారు. తన భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని కోరినందుకు పల్నాడు జిల్లాలో మంత్రిబాయి అనే ఎస్టీ మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి చంపారు. న్యాయం కోరినందుకు మహేష్ అనే గిరిజన యువకుణ్ని హింసించారు. డాక్టర్లు, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు ఎలా ఎందరో జగన్ బాధితులయ్యారు' అని సంధ్యారాణి పేర్కొన్నారు.

# రేవంత్ మాట తప్పారు!

హైదరాబాద్, ఏప్రిల్ 23: కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిమాట తప్పారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఒక్కటేనని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ఆయన గురువారం తీవ్రంగా స్పందించారు. అసలు సమస్యలను పక్కన పెట్టి కేబినెట్ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రామచందర్ రావు మండిపడ్డారు. గతంలో పీఆర్సీ విషయంలో కేసీఆర్ మాట ఇచ్చి తప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని.. ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీజేపీ కార్యకర్తలు కార్మికులకు అండగా ఉంటారని రామచందర్ రావు వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే కార్మికులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే బీజేపీ తరపున ప్రత్యక్ష ఆందోళనల్లో పాల్గొంటామని హెచ్చరించారు. శుక్రవారమే ప్రభుత్వం కార్మికులను చర్చలకు పిలవాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

# జగన్ తెచ్చిన పరిశ్రమలకు చంద్రబాబు శంకుస్థాపనలు..

-మొదటిపేజీ తరువాయి

ఈ ప్రాజెక్టు వైయస్ .జగన్ ప్రభుత్వ కృషికి ఫలితమని స్పష్టం చేశారు. 2023 గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలనే ఇప్పుడు చంద్రబాబు తన ఖాతాలో వేసుకుంటున్నారని మండిపడ్డారు.

పారిశ్రామిక వేదికను పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చేలా వాడాల్సింది పోయి, వైయస్.జగన్ పై రాజకీయ విమర్శలు చేయడం బాబు దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. హత్యా రాజకీయాలకు పేటెంట్ హక్కు ఉన్న చంద్రబాబు, నేడు వైయస్. జగన్ వ్యక్తిత్వ హననానికి దిగడం విడ్డూరంగా ఉందన్నారు. రెండేళ్ల కూటమి పాలనలో ఒక్క కొత్త పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయిన చంద్రబాబు, జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' అభివృద్ధిపై ఫోబియాతో మాట్లాడుతున్నారని.. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ మానుకుని ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని అమర్నాథ్ డిమాండ్ చేశారు.

# తమిళనాడు, బెంగాల్లో తొలిదశ పోలింగ్ ప్రశాంతం

చెన్నై/కోల్కతా, ఏప్రిల్ 23: దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి అంకం ముగిసింది. అంచనాలను మించి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో అటు దక్షిణాదిలోనూ, ఇటు తూర్పు భారత్లోనూ ఓట్ల వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న ఓటర్లకు పోలింగ్ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించగా, రాత్రి పొద్దుపోయే వరకు కూడా పలు కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ భారీ పోలింగ్ శాతం ఎవరికి పట్టం కట్టబోతోందన్న ఉత్కంఠ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలైంది. పశ్చిమ బెంగాల్లో లో పోలింగ్ సరళిని గమనిస్తే ఓటరు నాడి స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలోని మొత్తం 294 స్థానాలకు గానూ, తొలి విడతలో 152 సీట్లకు జరిగిన ఎన్నికల్లో సాయంత్రం 5 గంటలకే రికార్డు స్థాయిలో 89.93 శాతం పోలింగ్ నమోదైంది. బెంగాల్ రాజకీయ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలవనుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కూడా సామాన్యులతో కలిసి క్యూలైన్లలో నిలబడి ఓటు వేయడం విశేషం, మరోవైపు తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించారు. అక్కడ కూడా ఓటర్ల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. సాయంత్రం 5 గంటల సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 82.24 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. చెన్నై నుంచి కన్యాకుమారి వరకు ఓటర్లు భారీగా తరలివచ్చి ప్రజాస్వామ్య పండుగలో పాల్గొన్నారు. ఎన్నికల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రక్రియను సజావుగా పూర్తి చేశారు. ఈ రెండు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓట్ల లెక్కింపు. ఫలితాల ప్రకటన మే 4, 2026 (సోమవారం)న వెలువడనుంది.

## మీర్జాపూర్ లో ఘోర ప్రమాదం: 11 మంది సజీవదహనం!

**లక్నో, ఏప్రిల్ 23:** ఉత్తర్ ప్రదేశ్ లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును, కంటైనర్ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి.

దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

## శబరిమల కేసులో 'వాట్సాప్' సెటైర్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠ రేపుతున్న శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టులో గురువారం కీలక విచారణ జరిగింది. తొమ్మిది మంది సభ్యుల సుదీర్ఘ ధర్మాసనం ముందు వాడివేడి వాదనలు కొనసాగుతుండగా, న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఆధునిక కాలంలో సమాచార వ్యవస్థ ఏ విధంగా తప్పుదోవ పట్టిస్తోందో వివరిస్తూ ఆమె వేసిన 'వాట్సాప్ యూనివర్సిటీ' సెటైర్లు కోర్టు హాల్లో నవ్వులు పూయించడమే కాకుండా, ఆలోచింపజేశాయి. విచారణ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ.. జ్ఞానం ఏ మూల నుంచి వచ్చినా, ఏ విశ్వవిద్యాలయంనుంచి వచ్చినా దానిని ఆహ్వానించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26లను ఉటంకించారు. దీనిపై జస్టిస్ నాగరత్న వెంటనే స్పందిస్తూ.. "ఏ విశ్వవిద్యాలయం నుంచి వచ్చినా పరవాలేదు కానీ, వాట్సాప్ యూనివర్సిటీ నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రం కాదు" అంటూ చమత్కరించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియాలో విచ్చలవిడిగా ప్రబలుతున్న తప్పుడు సమాచారాన్ని కోర్టులు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకూడదనే ఉద్దేశంతో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. వాదనల క్రమంలో మతపరమైన ప్రాథమిక హక్కుల అంశం తెరపైకి రాగా, సామాజిక సంస్కరణల పేరుతో ఈ హక్కులను కాలరాయలేమని న్యాయవాది కౌల్ వాదించారు. రాజ్యాంగ నైతికత అనేది ఒక అస్పష్టమైన పదమని, దానితో మత విశ్వాసాలను కొలవలేమని దావూదీ బోహ్రా వర్గం తరపు న్యాయవాది అభిప్రాయపడ్డారు. అయితే, దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. మతపరమైన హక్కులు అనేవి ఎప్పుడూ వ్యక్తిగత స్వేచ్ఛకు మాత్రమే పరిమితం కావని, అవి దేశ నైతికత, ప్రజారోగ్యం మరియు శాంతిభద్రతలకు లోబడే ఉండాలని జస్టిస్ నాగరత్న గుర్తుచేశారు. రాజ్యాంగ పరిధిని దాటి మత విశ్వాసాలు ఉండవనే సంకేతాన్ని ఈ విచారణ ద్వారా సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది.

## బిట్స్ అమరావతి క్యాంపస్‌లో 2027 నుంచి ప్రవేశాలు

-మొదటిపేజీ తరువాయి

ఏఐ విభాగాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అమరావతిలో బిట్స్‌ను మూడు దశల్లో నిర్మిస్తామన్నారు. మొత్తం 10 వేల మంది విద్యార్థులు చదువుకునేలా దాన్ని ఐకానిక్ ఏఐ క్యాంపస్‌గా నిర్మించనున్నట్లు చెప్పారు. రాజధానిలోని క్యాంపస్ నిర్మాణం సహా సంస్థ విస్తరణ కోసం రూ.250 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించారు.

## నేటి నుంచే వేసవి సెలవులు!

హైదరాబాద్, ఏప్రిల్ 23: తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు నేటి నుంచే వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారంతో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగియగా.. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభమైంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు. కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియడంతో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలలో 'తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలనిసూచించింది. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది నేటి నుంచే ప్రారంభమైంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్ర నిరాశ ఎదురైంది. సమ్మె కారణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఊళ్లకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు తమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

# ఉత్తరాంధ్రలో ప్రతిరోజూ పెట్టు బడుల పండుగే చంద్రబాబు.






- **అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా మారుస్తాం.**
- **160 గిగా వాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంలో 50 శాతానికి పైగా సాధించాం**
- **విద్యుత్ భారాన్ని భరిస్తున్నాం, విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తున్నాం.**
- **నాటి ప్రభుత్వంలో ప్రొక్లెయిన్లతో కూల్చివేతలు, నేడు అభివృద్ధి పనులు.**
- **అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నాం.**
- **రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌కు చెందిన రెండు ప్లాంట్లకు సీఎం భూమి పూజ.**

**రాంబిల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 23**: ప్రజల పై విద్యుత్ భారాన్ని వేయకుండా ఆ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందని, అలాగే విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. జాతి నిర్మాణంలో భాగంగా రెన్యూవబుల్ ఎనర్జీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని సీఎం చెప్పారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జెడ్ చింతువలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థకు చెందిన రెండు ప్లాంట్ల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయుడు గరువారం భూమి పూజ నిర్వహించారు. రూ.5,400 కోట్లతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాంబిల్లి పెట్టుబడులు పెట్టనుంది. సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టు పనులకు సీఎం చంద్రబాబు భూమి పూజ చేశారు. రూ.4,200 కోట్లతో 6.5 గిగావాట్ల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, రూ.1,200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టును రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ రెండు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 2,100 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా భారీ పెట్టుబడులతో అభివృద్ధిని ఆకర్షిస్తోందన్నారు. పెట్టుబడుల్లో ఈ జిల్లా భారత్ లోనే అగ్రస్థానానికి చేరుతుందన్నారు. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ ఇండియా స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ సంస్థ 6.5 గిగావాట్ల ఇన్ గాట్ సోలార్ వేఫర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి జిల్లా వెనుకబడిన ప్రాంతం. కానీ ఇప్పుడు ఆ జిల్లానే అత్యంత సంపద కలిగిన ప్రాంతంగా మారిందన్నారు. విశాఖ సమీపం లోని అనకాపల్లి మరో రంగారెడ్డి జిల్లాగా తయారవుతుంది. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు సుమంత్ సిన్హా ఈ సోలార్ వేఫర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాన్ని ఎంచుకుని వ్యాపారం మొదలు పెట్టారు, ఇప్పుడు పెట్టుబడులు పెట్టడానికి ఏపీని ఎంచుకున్నారు. రెన్యూ ఎనర్జీ కేంద్ర కార్యాలయాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని ఆ సంస్థను కోరుతున్నాను. రెన్యూ ఎనర్జీనే కాదు, జాతీయ అంతర్జాతీయ సంస్థలను ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నాం, ఏపీలో పెట్టు బడులు పెడితే సురక్షితంగా ఉంటాయన్నారు. ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నా అన్నారు చంద్రబాబు. గడచిన 22 నెలల్లో 802 ఎంఓయూలు చేసుకున్నాం, వాటి పై నిరంతరం సంప్రదింపులు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా అనుమతులు ఇస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ద్వారా సుపరిపాలన అందిస్తున్నాం. 2019-24 మధ్య పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు భయపడ్డారు. వేధింపులు, అవినీతి పెద్ద ఎత్తున జరిగింది. 2024 లో మీరు వేసిన ఒక్క ఓటుతో ప్రజల్లో అభద్రత, ఆందోళనను తొలగించాం. ఎన్డీఏ బ్రాండ్ తో ఏపీలో విశ్వాసం తిరిగి వచ్చింది. పరిశ్రమలకు, పెట్టుబడులకు భరోసా వచ్చింది. పారిశ్రామిక వేత్తలకు సహకరిస్తూ భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉత్తరాంధ్రలో ప్రతి రోజూ పెట్టుబడుల పండుగ. ఈ నెల 28 తేదీన 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. జూలైలో భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రాబోతోంది. లారస్ ల్యాబ్ రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ముందుకు వస్తోంది. ప్రధాని మోదీ సహకారంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. రైల్వే జోన్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాం. విశాఖ-రాజమహేంద్రవరం మధ్య కార్గో కోసం నాలుగు రైల్వేలైన్ల స్పీడ్ రైల్ కారిడార్ వస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇతర రాష్ట్రాల నుంచే ఇక్కడికి వచ్చి ఉపాధి పొందే పరిస్థితి తెస్తాం. ఈ రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌తో నన్ను విశ్వసించిన యువతకు ఉద్యోగాలు వస్తున్నాయి అని ముఖ్యమంత్రి చెప్పారు.



**రెన్యూవబుల్ ఎనర్జీతో జాతి నిర్మాణం.**

అభివృద్ధి సూచికల్లో విద్యుత్ వినియోగం కూడా ఓ భాగం. ఎంత విద్యుత్ వినియోగిస్తే అంత అభివృద్ధి సాధించినట్టే. అందుకే రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. గత పాలకులు విధ్వంసం చేసిన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మాణం చేయాలన్న లక్ష్యంతోనే కూటమి ప్రజా ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెన్యూ ఎనర్జీ వేలకోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. రాంబిల్లిలో సౌర ఫలకాలు తయారవుతాయి. విద్యుత్ సంస్కరణల్ని ప్రారంభించింది మేమే. ఆ ఫలితాలు అందరికీ అందుతున్నాయి. ఏపీలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 90 గిగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి చేసేలా పనులు గ్రౌండ్ అయ్యాయి. రూ.5.95 లక్షల కోట్లు ఈ రంగంలో పెట్టుబడులు వచ్చాయి, ఎంఓయూలు సిద్ధమైపోయాయన్నారు. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోంది. గ్రీన్ ఈవీ వాహనాలు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాం. ఆర్టీసీ కూడా 1,050 బస్సులు తీసుకువస్తోంది. భవిష్యత్తులో ఆర్టీసీ బస్సులన్నీ ఈవీ బస్సులే. పేదలకు కూడా ఆర్టీసీ బస్సుల్లో తిరిగే సౌకర్యాన్ని అందుబాటు లోకి తెస్తాం. రాష్ట్రంలో 5 వేల ఛార్జింగ్ స్టేషన్లను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయబోతున్నాం. ప్రతీ ఇంటి పైనా విద్యుత్ ఉత్పత్తి కోసం పీఎం సూర్యఘర్ కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవాలి. 40 లక్షల ఇళ్లకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అటు రైతులు కూడా పీఎం కుసుమ్ కింద సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడ ఉత్పత్తి చేసిన విద్యుత్ అక్కడే వాడుకునే పరిస్థితి ఉంటే ట్రాన్స్ మిషన్ నష్టాలు కూడా ఉండవు. రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి అంటే జాతి నిర్మాణమే. అలాంటి మంచి కార్యక్రమానికి సహకరిస్తున్న రెన్యూ సంస్థను అభినందిస్తున్నాను. ప్రస్తుతం యుద్ధం జరుగుతోంటే గ్యాస్ కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దేశీయంగానే విద్యుత్ ఉత్పత్తి సహా ఇతర అంశాల్లో మనం ముందంజలో ఉంటే, అంతర్జాతీయంగా వచ్చే ఇబ్బందులను తట్టుకునే పరిస్థితి ఉంటుంది. అందుకే ప్రధాని మోదీ రెన్యూవబుల్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నారు అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**గత ప్రభుత్వ తప్పులను సరి చేస్తున్నాం.**

పేదల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజలకు సుపరిపాలన అందేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ రంగం సహా వివిధ వ్యవస్థల్లో గత ప్రభుత్వ తప్పిదాలు సరి చేస్తున్నాం. 2019-24లో పీపీఏలు రద్దు చేసి, నిర్వహణా లోపంతో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి విద్యుత్ వ్యవస్థను ధ్వంసం చేశారు. పీపీఏల రద్దు కారణంగా విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనం కట్టాల్సి వచ్చింది. ప్రజల పై రూ. 32 వేల కోట్ల భారాన్ని గత పాలకులు వేశారు. ట్రూ ఆప్ ఛార్జీలు పేరుతో భారీగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారు. గత పాలకులు వేసిన ట్రూ ఆప్ ఛార్జీలను, మేం చరిత్రలో తొలిసారిగా ట్రూ డౌన్ అమలు చేశాం. దీంతో పాటు ట్రూ అప్ భారాన్ని కూడా ప్రజల పై మోపకుండా ప్రభుత్వమే భరిస్తోంది. రూ.15,795 కోట్లు ఛార్జీల భారం పెంచకుండా ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే నిలబెట్టుకుంటున్నాం. ఇప్పుడు మళ్లీ చెబుతున్నాం విద్యుత్ ఛార్జీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచం. గత పాలకులు ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చారు, వాటిని రీషెడ్యూలు చేస్తున్నాం. అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నాం. రాజధాని అమరావతి నిర్మాణంతో రాష్ట్ర దశాదిశ మారుతుంది. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ సహా 9 జిల్లాలు, అమరావతి కేంద్రంగా పశ్చిమగోదావరి నుంచి ప్రకాశం వరకూ, తిరుపతి కేంద్రంగా రాయలసీమ అంతటా వివిధ రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రతో హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధించడం ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా, జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.










## నేరాలు ఘోరాలు చేసే ఓ పార్టీ రాష్ట్రంలో అరాచకాలు చేస్తోంది చంద్రబాబు.

- **వివేకా హత్య తరహాలోనే కడపలో దస్తగిరి అనే వ్యక్తిని హత్య చేశారు.**
- **డబ్బుకోసం, ఆస్తుల కోసం సొంత మనుషుల్ని సైతం కడతేర్చే కిల్లర్ పార్టీ అది.**
- **ఇలాంటి మోసగాళ్ల పై నిరంతరం కన్నేసే ఉంచుతున్నాం.**



**రాంబిల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 23:** రాష్టంలో ప్రస్తుతం నేరస్థులతో రాజకీయం చేయాల్సిన పరిస్థితి తలెత్తింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. మంచి కార్యక్రమాలలో, శుభ దినాల్లో కూడా తప్పుడు పనులు చేసే వారిని దుర్మార్గులను గుర్తు ఉంచుకోవాలి, అలాంటి వారి విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి కాబట్టి చెప్పాల్సి వస్తోంది. నేరాలు ఘోరాలు చేసే ఓ పార్టీ రాష్ట్రంలో అరాచకాలు చేస్తోంది. వివేకా హత్య తరహాలోనే కడపలో దస్తగిరి అనే వ్యక్తిని హత్య చేశారు. జగన్ మోహన్ రెడ్డి మేనమామకు ప్రధాన అనుచరుడు ఆస్తుల కోసం పెద్ద దస్తగిరిని చంపేశారు. డబ్బు కోసం, ఆస్తుల కోసం సొంత మనుషుల్ని సైతం కడతేర్చే కిల్లర్ పార్టీ అది. గత ప్రభుత్వంలో డ్రైవర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఎమ్మెల్సీగా చేశారు. ఇప్పుడు మళ్లీ అతనే సాక్షుల్ని బెదిరించే స్థాయికి చేరాడు. అలాంటి రాజకీయ పార్టీ ఐడియాలజీని ప్రజలు అర్థం చేసుకోవాలి, ఇలాంటి పార్టీలు సమాజానికి దూరం చేయాలి అన్నారు. అధికారం లోకి వస్తే నరికేస్తాం, చంపేస్తాం, పెట్టుబడి దారులను తరిమేస్తాం అని బహిరంగా బెదిరిస్తున్నారు, ఇలాంటి బెదిరించే పార్టీలు మనకెందుకు?. ఫ్లెక్సీలకు జంతు బలులు ఇచ్చి అభద్రతా భావం సృష్టించే వాళ్లు రాజకీయాల్లో అవసరమా?. పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టేందుకు వచ్చేవారికి సహకరిస్తూ భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాలుష్య రహిత వాతావరణం, సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహిస్తాం.

జాతి నిర్మాణం కోసం సహకరిస్తున్న రెన్యూ సంస్థను అభినందిస్తున్నాను అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో మంచి జరుగుతోంటే, కిల్లర్ పార్టీకి ఫ్రస్టేషన్ పెరిగిపోతోంది. నాడు ఉత్తరాంధ్రలో ప్రొక్లయినర్ తో కూల్చివేతలు జరిగేవి. నేడు అవే ప్రొక్లయినర్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. నాడు ఉత్తరాంధ్ర ప్రాంతంలో భూములను కబ్జాలు చేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్లు చేశారు. కానీ నేడు అవే భూముల్లో ప్రపంచ స్థాయి కంపెనీలు వస్తున్నాయి, రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నాయి, శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రకృతి వనరులు దోచిన పాలకులకు, ప్రకృతి వనరులను సంపదగా మార్చే ప్రభుత్వాలకు మధ్యనున్న తేడాను ప్రజలంతా గమనించాలి అని సీఎం చంద్రబాబు అన్నారు.

## ఉపమాక పంచాయతీ పాలకవర్గానికి ఘన వీడ్కోలు





**నక్కపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 23:**ఉపమాక గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు గురువారం గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. గ్రామపంచాయతీ పాలకవర్గ పదవీ కాలం ఈనెల రెండవ తేదీతో ముగిసిపోవడంతో ఘనంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధికి నిరంతరం పాటుబడిన సేవలను కొనియాడుతూ ఇంచార్జి సర్పంచ్ ప్రగడ వీరబాబు తో పాటు పాలకవర్గ సభ్యులు పొన్నాడ ఉమా, తోట కుమారి, పోలవరపు గోవిందు, గోగులపాటి గుర్రాజు, మామిడి చంద్రయ్య, మామిడి రవణమ్మ, ఎలమంచిలి వెంకటేష్,కోన అప్పారావు, మన బాల లక్ష్మి, యిసరపు లక్ష్మి,బొడ్డపు రాజు లకు శాలువాలు కప్పి, పూల బొకేలు అందజేసి ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండపరిషత్ ఏ ఓ సీతారామరాజు, నక్కపల్లి పిఎసిఎస్ చైర్ పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్, ఉపమాక గ్రామ టిడిపి అధ్యక్షులు కొప్పిశెట్టి శ్రీను, టీడీపీ, జనసేన నాయకులు గుద్దాటి సత్యనారాయణ,గొర్ల రవి, కొంకిపూడి దొరబాబు, కోరుకొండ వరాహలరావు, ఎలమంచిలి బుజ్జి, జోగారావు, శ్రీను, కొప్పిశెట్టి వాసు, తోలేటి శ్రీనివాస్, తోట అప్పారావు, పాము గణేష్, ఎలమంచిలి చందర్రావు, మామిడి బాబ్జి,మనబాల బుజ్జి, గోకులపాటి కనక, మేడిశెట్టి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగీరథ జయంతి



**వనపర్తి జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 23:**:మహ్మదాపూర్ గ్రామంలో ఈరోజు గంగానదిని భూమి పైకి తెచ్చిన సగర భగీరథ మహర్షిని స్మరించుకుంటు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల లు వేసిన వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ మరియు గ్రామ మాజీ సర్పంచ్లు జయరాములు సాగర్ , మరియు కృష్ణయ్య సాగర్ ,గ్రామ సర్పంచ్ సుగుణమ్మ రాములు , మరియు ఉప సర్పంచ్ శ్యామ్ సుందర్ గౌడ్,,మరియు మాజీ ఫ్రూజ భాస్కర్ రెడ్డి, మరియు గ్రామ సగరనాయకులు లంకల ఆంజనేయులు,మూసిని శ్రీనివాసులు,గొబ్బూరి రవి,గొబ్బూరి పురెంధర్, దిండి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం,

- గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులు





**చేగుంట పెన్ సత్తా, ఏప్రిల్ 23:**:చేగుంట మండల్ అనంతసాగర్ గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో గ్రామ సర్పంచ్ శ్రీధర్, మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ , హోసింగ్ ఏ ఈ రియాజద్దిన్, తో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు..

ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం, పేద ప్రజలకు గృహ స్వప్నాన్ని నెరవేర్చే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంతింటి సంతోషాన్ని పొందుతున్నాయని వారు పేర్కొన్నారు..

ఇట్టి కార్యక్రమంలో హోసింగ్ ఏఈ రియాజద్దియిన్, చేగుంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్,అన్నం ఆంజనేయులు, స్టాలిన్ నర్సింలు బాల్ రెడ్డి, చేగుంట మండల పార్టీ ఉపధ్యక్షులు, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల్ జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజేష్,,గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ కాంగ్రెస్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ ప్రభుత్వం వెంటనే ప్రతి రైతు కు ఫసల్ యోజన పథకం పైన అవగాహన కల్పించాలి.

- బిజెపి పార్టీ జిల్లా నాయకులు మంద నరసింహ ముదిరాజ్.



**వలిగొండ మండలం పెన్ సత్తా, ఏప్రిల్ 23**: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న సంఘం గ్రామంలో బిజెపి పార్టీ జిల్లా నాయకులు మంద నరసింహ ముదిరాజు మీడియాతో మాట్లాడుతూ,తెలంగాణ రైతులు పండించిన పంట నష్టం జరిగినప్పుడు రైతులకు ఆర్థిక సహాయం అందించడం వ్యవసాయంలో స్థిరమైన ఆదాయాన్ని నిర్ధారించడం పసల యోజన పథకం ఉద్దేశం మనీ,

ఈ పథకం 2016 లో ప్రారంభించబడింది రైతు పండించిన పంటలు నూనెగింజలు మరియు వార్షిక వాణిజ్య ఉద్యాన పంటలకు ఈ బీమా వర్తిస్తుంది పంట రుణం పొందిన రైతులు స్వతగా సాగు చేసే రైతులు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు పసలు యోజన పథకం ప్రతి రైతుకు అర్థమయ్యే విధంగా తెలంగాణ ప్రభుత్వం చర్య తీసుకుని రైతులకు అవగాహన కల్పించి రైతులు నష్టపోకుండా ప్రతి పంట వేసిన వెంటనే ఆన్లైన్ పోర్టల్ ద్వారా పసలు యోజన పథకం కోసం దరఖాస్తు చేసుకునే విధంగా చర్య తీసుకోవాలని మీడియా ద్వారా మాట్లాడినారు.

# స్మార్ట్ కిచెన్ రద్దు చేయాలి, మధ్యాహ్నం భోజన పథకాన్ని బలోపేతం చేయాలి.




**పరవాడ, పెన్ సత్తా, ఏప్రిల్ 23**: మండల కేంద్ర మైన పరవాడలో గురువారం మధ్యాహ్నం భోజన పథకంకార్మికుల సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా మధ్యాహ్నం భోజన పథకాన్ని వండి పెడుతున్న కార్మికులను తొలగించి, కేంద్ర బిజెపి, రాష్ట్ర కూటమి ప్రభుత్వా లు స్మార్ట్ కిచెన్ పేరుతో ఒకే చోట వండి స్కూల్ కి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ స్మార్ట్ కిచెన్ వలన వేలాది మంది వంటకారులకు ఉపాధి పోతుందని, స్మార్ట్ కిచెన్ కి వ్యతిరేకంగా ఈ నెల 24 న శుక్రవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలు, మధ్యాహ్నం పథకం కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. వంట కార్మికుల ఉపాధి రక్షణ కోసం స్మార్ట్ కిచెన్ కు వ్యతిరేకంగా 24 జరిగే ఆందోళనలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి కే విమల, సిహెచ్ దేవుడమ్మ, అప్పలకొండ, తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది..



- ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరేలా సకల సదుపాయాలు కల్పిస్తున్నాం.
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 23**:మణుగూరు మండలం లంక మల్లారం గ్రామంలో గురువారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేసి, టీటీఆర్జేసీ బాలికల డార్మెటరీ హాల్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకటరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి ముందుగా రూ.1 కోటి అంచనా వ్యయంతో ప్రధాన బీటీ రహదారి నుండి పాఠశాల వరకు అప్రోచ్ బీటీ రహదారి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇటీవలే రూ.2 కోట్లు 70 లక్షల వ్యయంతో బాలికల వసతి గృహాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. పేదవారి పిల్లలు కూడా ధనికుల పిల్లలతో సమానంగా చదువుకోవాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వ పాఠశాలలు మరియు రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. విద్య పట్ల ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు అనేక నిదర్శనాలు ఉన్నాయని వివరించారు.

పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా మంచి ఆహారం తీసుకుంటూ, మెరుగైన విద్యను అభ్యసించాలనే ఆశయంతో ప్రభుత్వం హాస్టళ్లలో ఉన్న బాలబాలికలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తోందన్నారు. ఇంటి వద్ద తల్లులు చేసే వంటల రుచిని గుర్తు చేసేలా పోషకాహారంతో కూడిన మెనూను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ అందించే ఆహారం విషయమై స్పష్టమైన ప్రణాళికతో హాస్టళ్లలో సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.

ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుపై పూర్తి విశ్వాసంతో ఉందని, వారు తమ కాళ్ల మీద నిలబడి దేశాన్ని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగగలరని నమ్ముతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎవరికీ చదువు ఆగిపోకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. పేదవారి పిల్లలు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను పొందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.65 కోట్ల వ్యయంతో ఏ టీ సి కేంద్రాల ద్వారా వివిధ నైపుణ్యాలపై శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎలక్ట్రిషియన్, మెకానిక్ వంటి రంగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు. ఈ శిక్షణల ద్వారా వారు స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

వైద్య రంగంలో కూడా పేదవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. పేదల పక్షపాతిగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు.ప్రభుత్వం మీ కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ లో శాతం వంద ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ మరియు సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వ తరఫున హృదయ పూర్వకంగా అభినందించారు. ఇదే విధంగా భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ , ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు. పినపాక నియోజకవర్గంలో కూడా ఈ పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు గిరిజన అభివృద్ధి కోసం అదనంగా 1000 ఇళ్లు మంజూరు చేసి, నియోజకవర్గంలోని 380 గ్రామాలకు సుమారు 4500 ఇళ్లు ఆమోదించామని వివరించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నామని, "అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ" ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు.

భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకటరావు మాట్లాడుతూలి , ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ డైట్ ఛార్జీలు పెంచి పోషకాహారం అందిస్తున్నదన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించ బడుతున్నాయని, ఈ అవకాశాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యాచరణ"లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్ వంటి వసతులను పూర్తి స్థాయిలో కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్లాసులు నిర్వహించి విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో శిక్షణ అందించనున్నామని తెలిపారు. పేరెంట్స్ మీటింగ్స్ ద్వారా తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుతూ, విద్యార్థుల డ్రాప్ఔట్ రేటును తగ్గించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ మాట్లాడుతూ, ఈ విద్యాసంస్థలో ప్రస్తుతం 584 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. 16 గదులతో నిర్మించిన కొత్త డార్మెటరీ ద్వారా సుమారు 600 మందికి వసతి కల్పించగల సామర్థ్యం ఏర్పడిందన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉందని, ఐఐటీ తదితర ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గిరిజన గురుకుల విద్యాసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం రూ.53 కోట్లు మంజూరు చేయగా, భద్రాచలం ఐటీడీఏకు రూ.6 కోట్లు, ఈ పాఠశాలకు రూ.25 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. గిరిజన పాఠశాలల్లో కూడా డిజిటల్ తరగతులు నిర్వహించేలా తగిన సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి ని కోరారు.

ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ పూనెం రమేష్,పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఘన నివాళి

- సగరుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తాం: ఎమ్మెల్యే మేఘారెడ్డి.



**వనపర్తి జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 23**:వనపర్తి జిల్లాలో భగీరథ మహర్షి ఆదర్శప్రాయుడని, ఆయన పట్టుదల, క్రమశిక్షణ నేటి తరానికి మార్గదర్శకమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.

బుధవారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కలిసి వనపర్తి పట్టణంలోని భగీరథ చౌరస్తా మరియు జిల్లా కలెక్టరేట్లో ఉన్న భగీరథ మహర్షి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భగీరథుడు గంగను భువికి తీసుకువచ్చిన మహాముని అని, ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అపర భగీరథుడైన మహర్షిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు.

అదేవిధంగా సగరుల సమస్యలను పరిష్కరించడానికి, వారి సంక్షేమానికి త్వరలోనే సీఎం అనుమతితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సగరుల సమస్యలు తీర్చడానికి పూర్తిగా సహకరిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలోమార్కెట్ యార్డ్ చైర్మన్ బి. శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మిడిదొడ్డి మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధు గౌడ్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘము ఉప అధ్యక్షులుగా పొన్న గణేష్ బాబు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 23**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసీకి తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘము ఉప అధ్యక్షులు గా పొన్న గణేష్ బాబు నియమించారు. భద్రాచలం లోని పద్మశాలి సంఘము యొక్క భవన్ లో మాజీ ఆల్ ఇండియా యూత్ ప్రెసిడెంట్ గుండేటి శ్రీధర్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ కొత్తగూడెం ఈ సి మెంబర్ సామంతుల నరేష్ తదితురుల సమక్షంలో గణేష్ బాబుకి పదవి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘము ఉప అధ్యక్షులు గా పదవి ఇచ్చినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పద్మశాలీలను ఐక్యంగా ముందుకు తీసుకువెళ్తానని నాకు ఈ బాధ్యతలు అప్పజెప్పిన అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘము ఉప అధ్యక్షులు గా పొన్న.గణేష్ బాబు.

# జిల్లాలో ఆహార భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు.




- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.
- జిల్లా ఆహార భద్రత అధికారి శరత్...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 23**:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఆహార భద్రత శాఖ విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆహార భద్రత అధికారి శరత్ ఒక ప్రకటన లో తెలిపారు. అక్టోబర్ 2025 నుండి ఇప్పటి వరకు జిల్లాలోని మణుగూరు, చర్ల , దుమ్ముగూడెం, అశ్వారావుపేట, అశ్వాపురం, భద్రాచలం, బూర్గంపహాడ్, పాల్వంచ తదితర మండలాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బేకరీలు, స్వీట్స్ షాపులు, ఇతర ఆహార విక్రయ కేంద్రాలపై నిరంతర తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఈ తనిఖీలలో భాగంగా వివిధ ఆహార పదార్థాలపై సర్వైలెన్స్ నమూనాలు సేకరించి ప్రయోగశాలలకు పంపిస్తున్నామని తెలిపారు. ఆహార భద్రత నిబంధనలు ఉల్లంఘించిన 42 మంది వ్యాపారుల పై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించామని పేర్కొన్నారు. లోపాలు గుర్తించిన సంస్థలకు ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీ చేసి, నిబంధనలు తప్పని సరిగా పాటించాలని కఠినంగా ఆదేశించామని వెల్లడించారు.

ప్రజల ఆరోగ్య విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన ఆయన, జిల్లాలోని అన్ని ఆహార విక్రయ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

అక్టోబర్ 2025 నుండి ఎన్ఫోర్స్మెంట్ సాంపిల్స్ -- 70, సర్వైలెన్స్ సాంపిల్స్ -- 105, మొత్తం తనిఖీలు ( ఎఫ్ ఓ ఎస్ సి ఓ ఎస్) -- 210, నాణ్యత లోపం కేసులు -- 21, అసురక్షిత ఆహార కేసులు -- 09, లైసెన్స్ మేళాలు -- 03, జారీ చేసిన లైసెన్సులు -- 111, జారీ చేసిన రిజిస్ట్రేషన్లు -- 343, ఇంప్రూవ్మెంట్ నోటీసులు -- 15, పరిష్కరించిన కేసులు -- 12

వసూలు చేసిన జరిమానా -- రూ" 53,000

ప్రత్యేక డ్రైవ్స్ --06

ప్రజలు కూడా ఆహార భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని శరత్ కోరారు. ఎక్కడైనా అశుభ్రత, కల్తీ లేదా నాణ్యతలేని ఆహారం విక్రయం జరుగుతున్నట్లు గమనించినట్లయితే పాల్వంచలోని ఐడిఓసి కార్యాలయంలో ఎఫ్3 గదిలో ఉన్న ఆహార భద్రత కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జిల్లాలో ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందుబాటులో ఉండేలా ఆహార భద్రత శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి.

- సమీక్షా సమావేశంలో శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 23**:ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిర్దేశించిన గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. గురువారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయనమాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దఫాలుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమకావాల్సిన బిల్లుల విషయంలో ఎదురవుతున్న లోపాలను వెంటనే సరిచేయాలని సూచించారు. ముఖ్యంగా సాంకేతిక సమస్యల కారణంగా బిల్లులు నిలిచిపోకుండా స్థానిక అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. స్థానిక పరిధిలోని సమస్యలను ఇక్కడే పరిష్కరించి, రాష్ట్ర స్థాయిలోని పెండింగ్ అంశాలను సత్వరమే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. ఇండ్ల నిర్మాణ బిల్లుల విషయంలో పేద లబ్ధిదారులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆయన పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, హౌసింగ్ పిడి రవీంద్రనాథ్, కమిషనర్ సుజాత, ఎంపిడివోలు, తహసీల్దార్లు, గృహనిర్మాణ శాఖా అధికారులు పాల్గొన్నారు.

# కేకే కమిటీ యొక్క విధి విధానాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి

- మా సంఘము యొక్క సెక్రటేరియట్ ముట్టడి ఫలితమే కేకే కమిటీ నిర్మాణం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు



. **ఖమ్మం పెన్ సత్తా, ఏప్రిల్ 23**:: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు పాల్గొని మాట్లాడారు . తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం ఫలితమే ఈ కేకే కమిటీ నిర్మాణం . కేకే కమిటీ యొక్క విధి విధానాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని కొంతమందికి ప్రోత్సాహంగా మరి కొందరికి మానసిక క్షోభ గురి చేసే విధంగా ఉందని ఆ కమిటీకి కాలపరిమితి , చట్టబద్ధత ఉండాలని కమిటీని గుర్తించే విధానం కూడా ఏ బి సి గా గుర్తించి ఏ క్యాటగిరిలో సకల సమ్మె ఉద్యమంలో పాల్గొన్న వారిలో వికలాంగులు , ఉద్యమకారులు ఉండాలి , బి క్యాటగిరిలో జైలు జీవితం అనుభవించిన వాళ్లు , కేసులు ఉన్నా వాళ్లు , సి క్యాటగిరిలో బైండోవరు కేసులు , ఉద్యమ సంఘం నాయకులు , ఫోటో వీడియో క్లిప్పింగులు , ఆడియో వీడియో క్లిప్పింగులు బట్టి గుర్తించి జీవో రిలీజ్ చేయాలి . ఉద్యమకారులు అందరికి న్యాయం చెయ్యాలి . ఏసి రూములలో కూర్చుని మాట్లాడుకోవడం కాదు డైరెక్ట్ గా ఉద్యమ నేతలు దగ్గరికి వెళ్లి అభిప్రాయ సేకరణ చేసి నికాసమైన ఉద్యమకారులను గుర్తించి వారికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి . తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఐడెంటి కార్డు , ప్రతినెల స్వతంత్ర సమరయోధులకు ఇస్తున్నట్లు 25 వేల పెన్షన్ , 250 గజాల స్థలం ఇంటి నిర్మాణం కోసం పది లక్షలు మరియు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి . ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులకు 5% వారికి లేకపోతే వారి కుటుంబాలకు రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు . ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ , ఖమ్మం జిల్లా కమిటీ , నియోజకవర్గ కమిటీ లు వేశారు . ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు గుంతేటి వీరభద్రం , వైస్ చైర్మన్ బచ్చల పద్మాచారి , వర్కింగ్ చైర్మన్ బత్తినీ మధు గౌడ్ , కోఆర్డినేటర్ గా కోడిరెక్కఉమాశంకర్ ,కో చైర్మన్ గా లింగన బోయిన సతీష్ ,బాలిని భాస్కర్ రెడ్డి , బొబ్బిలి భరత్ చంద్ర , బురాన్ , ఆసిఫ్ , మోత్కురి వెంకటాచారి , గాజుల రవి కుమార్ , కామన అనంత లక్మి , నల్ల స్వరూప రెడ్డి , కమలమ్మ తదితరులు పాల్గొన్నారు .

# ఐటీడీఏ పీవో రాహుల్ ని ఘనంగా సన్మానించిన భద్రాచలం బార్ అసోసియేషన్...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 23**:గిరిజనుల సంక్షేమం కొరకు ముఖ్యంగా విద్యా, వైద్యం, ఆదివాసి గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు మరియు కోయ భాషను నేర్చుకోవడమే కాక గిరిజనుల పట్ల చూపిస్తున్న ఆదరాభిమానాల ను మెచ్చుకొని ఆదివాసి జేఏసి ఆదివాసి వికాస్ రత్న బిరుదు ఐటిడిఏ పిఓకు అందించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ భద్రాచలం బార్ అసోసియేషన్ తరపున ఘనంగా సన్మానించడం జరిగిందని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొడాలి శ్రీనివాస్ అన్నారు.

గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో భద్రాచలంలోని బార్ అసోసియేషన్ సభ్యులు అందరూ కలిసి పిఓ ను సన్మానించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గిరిజనుల సంక్షేమానికి ఎనలేని సేవలు అందించారని, ముఖ్యంగా గిరిజన విద్యార్థినీ విద్యార్థుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించారని అలాగే జిపిఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉద్దీపకం వర్క్ బుక్ ప్రవేశపెట్టడం, ప్రైమరీ పాఠశాల విద్యార్థుల కొరకు కెరీర్ గైడెన్స్, క్రీడాకారులకు అధునాతనమైన క్రీడా పరికరాలు అందించడం, గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు అంతరించి పోకుండా నేటితరం గిరిజన యువతి యువకులు పాతకాలపు సాంప్రదాయాలు పాటించేలా అవగాహన కల్పించుకోవడాని కి గిరిజన మ్యూజియం ఏర్పాటు అలాగే ఎస్ హెచ్ జి మహిళలు, గిరిజన మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల నిత్యవసర సరుకులు, గిరిజన రైతుల ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, జి సి సి ద్వారా అటవీ ఉత్పత్తులు నేరుగా ప్రజలకు అందించే విధంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేత భద్రగిరి మార్ట్ తో పాటు గిరిజన మ్యూజియం ప్రారంభించిన ఘనత ఐటీడీఏ పిఓ కు దక్కినందుకు ఆయనను ప్రత్యేకంగా మా అసోసియేషన్ తరపున సన్మానించడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సున్నం రమేష్, కోశాధికారి రాము, సీనియర్ న్యాయవాదులు ప్రసాద్, మంత్రి ప్రగడ గణపతి, పలివెల నరసింహారావు, పడిశిరి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, రవి, నరసింహమూర్తి, సురేష్ కుమార్, నరేష్, రవితేజ, రామ్మోహన్రావు, సంధ్య, అంజలి తదితరులు పాల్గొన్నారు....

# ఈరోజు తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ ఉ జూనియర్ కాలేజ్ (బాయ్స్--1)లో ఘనంగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ నిర్వహించబడింది.

**సంగారెడ్డి. పెన్ సత్తా, ఏప్రిల్ 23**:ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ రాములు సర్ విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయంగా మాట్లాడారు. స్కూల్లో అందిస్తున్న ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన బోధన, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం గురించి సమగ్రంగా వివరించారు.

విద్య అనేది జీవితాన్ని మారుస్తుంది, భవిష్యత్తును నిర్మిస్తుంది అనే విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడి చదవాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల చదువులో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. అలాగే 2026--2027 విద్యా సంవత్సరానికి కొత్త అడ్మిషన్ల కోసం సహకరించాలని, ఈ మంచి విద్యా అవకాశాన్ని ఇతర విద్యార్థులకు కూడా తెలియజేయాలని తల్లిదండ్రులను కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన తరగతి టాప్ విద్యార్థులకు బహుమతులు అందజేయడం ద్వారా వారి కృషిని అభినందించారు. ఇది ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలిచింది.

ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్కూల్



కోఆర్డినేటర్ జాకిర్,రాజు అజీజ్, సిబ్బంది రమేష్ రెడ్డి, విఠల్ రెడ్డి, అనంత్ రాజ్, ప్రసాద్, నవనీత, అక్బర్, బుజమ్మ. ఆస్రా సుల్తానా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా, ప్రేరణాత్మకంగా ముగిసింది.

# మండల పరిధిలో నూతనంగా జి.ఎస్.ఆర్ ఏసి కన్వెన్షన్ హాల్ ప్రారంభం.





ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.

**వలిగొండ మండలం పెన్ సత్తా, ఏప్రిల్ 23**:. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న దాశిరెడ్డిగూడెం గ్రామం లో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని జి ఎస్ ఆర్ కన్వెన్షన్ ఏసీ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం చేసినారు,ప్రొప్రైటర్ శ్రీనివాసరెడ్డి ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం సందర్భంగా గణేశా పూజా కార్యక్రమం బ్రాహ్మణుల చేత నిర్వహించి, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం పూజా కార్యక్రమం కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించినారు, ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి శాలువాతో ఘనంగా సన్మానం చేసి ఆహ్వానించినారు, అధిక సంఖ్యలో మండల ప్రజలు జి ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు, ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పైల్ల శేఖర్ రెడ్డి పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో మండల నాయకులు జిల్లా నాయకులు నూతి రమేష్ రాజు,పాశం సత్తిరెడ్డి,జక్కజంగారెడ్డి,కాసుల వెంకన్న, గరిసె రవి,కోమిరెల్లి సంజీవరెడ్డి, దేశ బోయిన బాలస్వామి,రేసు బుచ్చిరెడ్డి,జక్క రాజేందర్రెడ్డి,గుర్రం లక్ష్మారెడ్డి,చెరుకు శివయ్య,ఈ తాప రాములు,బద్దం సంజీవరెడ్డి,చిల్మారి సత్తిరెడ్డి,బత్తిని సహదేవు,బత్తిని లింగయ్య,దాసిరెడ్డిగూడెం సర్పంచి గోపి,ఉపసర్పంచి చిన్నశ్రీశైలం,వార్డు నెంబర్లు తదితరులు అధిక సంఖ్యలో ఏసీ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందచేత.

**వలిగొండ మండలం పెన్ సత్తా, ఏప్రిల్ 23**: :- యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల, అరూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బుర్ర నర్సింహ అధ్యక్షతన, సర్పంచ్ సుక్క ముత్యాలు సమక్షంలో లబ్ది దారులకు సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులు అందచేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ లు కసిరబోయిన మత్స్యగిరి, వేముల అనిల్, కొడితల కరుణాకర్, పోలేపాక నర్సింహ,పిట్టల సుధాకర్, జక్కుల మత్స్యగిరి, బుర్ర శివ, బొలుగుల రాజు, బోగారం ఎల్లయ్య మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# పద్మశాలీలు రాజకీయ శక్తిగా ఎదగాలి.

- పద్మశాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఏప్రిల్ 23**:రాష్ట్రంలో పద్మశాలీలు రాజకీయశక్తిగా ఎదిగిన నాడే మనకు గుర్తింపు ఉంటుందని పద్మశాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు పేర్కొన్నారు. భద్రాచలంలో గురువారం భద్రాచలం పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో పద్మశాలీలు వెనుకబాటు తనం వల్ల మనకు ఇతర కులాల మాదిరిగా ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు ఎక్కువగా అందడం లేదని, మనలో ఐఖ్యత పెరిగితే అది మన కులానికి బలంగా మారి మనకు ప్రయోజనం చేకూర్చుతుందని అన్నారు. పద్మశాలీకులస్తులందరూ మీ స్థానిక ప్రాంతాల్లో జరిగే వివిధ ఎన్నికల్లో స్వచ్ఛందంగా పోటీ చేసిన నాడే మనకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పద్మశాలీలు తమ ఐక్యతను చాటి కుల సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం భద్రాచలం పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షులు జివివి సుదర్శనరావు, అధ్యక్షులు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావులు మాట్లాడుతూ భద్రాచలం డివిజన్లో పద్మశాలీలాల అభివృద్ధికి నూతన కార్యవర్గ సభ్యులందరం ఐక్యగా కలిసి కృషి చేద్దామని, భద్రాచలం పట్టణంలో ఉన్న పద్మశాలీలందరం ఐక్యంగా కలిసి ఒకే కుటుంబంగా మెలగాలన్నారు. సభ్యత్వ నమోదు, సంఘం తరపున చేపట్టే కార్యక్రమాలకు అందరూ తగిన సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. అనంతరం భద్రాచలం పట్టణ పద్మశాలి సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ జి వి వి సుదర్శన్ రావు, అధ్యక్షులుగా సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వరరావు, కోశాధికారిగా రవీందర్తో పాటు నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్ర రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొప్పెరి వెంకట హరి హర కిషన్, సంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం కార్యదర్శి సోమ రమేష్, పట్టణ పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ చట్టాలను అవమానించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోల సంజీవరెడ్డి పై తీవ్ర ఖండన

**సంగారెడ్డి. పెన్ సత్తా, ఏప్రిల్ 23**:




డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పట్లోల సంజీవరెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆందోళన కలిగించాయని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోర్గి భీమన్న గారు తెలిపారు.

ఎమ్మెల్యే గారు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టాన్ని "బోగస్ కేసులు"గా వ్యాఖ్యానించడం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలను అవమానించినట్టేనని ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గారు సభలో ఉన్న సమయంలోనే ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం మరింత దురదృష్టకరమని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం అనేది సామాజిక న్యాయం, రక్షణ కోసం రూపొందించిన కీలక చట్టమని, దానిని చిన్నచూపు చూడడం అసహ్యకరమని భీమన్న గారు అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలు రేకెత్తించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా సంబంధిత నాయకులు బాధ్యతతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సముచిత గౌరవం, హక్కులు కల్పించాలని, ఎటువంటి కుల వివక్షకు తావులేకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## చమురు మంటలు తప్పవా..?
## అమెరికా ఆరు నెలల గడువుతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రపంచం..

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి హర్మూజ్ జలసంధి మూతపడడం, తెరుచుకోవడానికి మరో ఆరు నెలలు పడుతుందన్న వార్త వింటుంటే చమురు ధరలు సామాన్యుడికి చుక్కలు చూపించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇరాన్ అమర్చిన ఆ 'అదృశ్య' మైన్స్ ఇప్పుడు ప్రపంచ దేశాలకు అతిపెద్ద సవాలుగా మారాయి.

పశ్చిమాసియాలో యుద్ధం ముగిసి శాంతి నెలకొంటుందని ఆశిస్తున్న ప్రపంచానికి పెంటగాన్ నివేదిక చేదు నిజాన్ని రుచి చూపించింది. ప్రపంచ వ్యాప్తంగా రవాణా అయ్యే ముడి చమురులో దాదాపు 20 నుంచి 30 శాతం వరకు ప్రవహించే అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని పూర్తిగా పునరుద్ధరించడానికి మరో ఆరు నెలల సమయం పడుతుందని అమెరికా రక్షణ శాఖ అంచనా వేస్తోంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఆకాశాన్ని తాకడం మాత్రమే కాకుండా, అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలే ప్రమాదం ఉంది.

**ఏమిటీ 'సీ మైన్స్' ?**

హర్మూజ్ జలసంధిని ఇరాన్ కేవలం మూసివేయడమే కాకుండా, అక్కడ అత్యంత ప్రమాదకరమైన సముద్రపు మైన్స్ అమర్చడం అసలు సమస్యగా మారింది. ఇరాన్ సుమారు 20 లేదా అంతకంటే ఎక్కువ మైన్స్‌ను జలమార్గంలో అమర్చినట్లు సమాచారం. ఇవి సముద్రం లోపల ఉండి, ఏదైనా భారీ నౌక లేదా ట్యాంకర్ తగిలినప్పుడు పేలిపోతాయి. సాధారణ మైన్స్ లా కాకుండా, వీటిలో కొన్నింటికి జీపీఎస్ సాంకేతికతను వాడడం వల్ల వీటిని గుర్తించడం అమెరికా నౌకాదళానికి సవాలుగా మారింది. మారుమూల ప్రాంతాల్లో, లోతైన నీటిలో వీటిని అమర్చడం వల్ల తొలగించే ప్రక్రియ అత్యంత ప్రమాదకరంగా మారింది.

**ఆరు నెలల ఆలస్యానికి కారణాలు**


పెంటగాన్ నివేదిక ప్రకారం.. ఇరాన్‌తో ఉద్రిక్తతలు పూర్తిగా తగ్గకుండా మైన్స్‌ను తొలగించే ఆపరేషన్ చేపట్టడం సాధ్యం కాదు. మైన్స్ తొలగించే సిబ్బందిపై ఇరాన్ దాడులు చేసే ప్రమాదం ఉంది. సముద్ర గర్భంలో ఉన్న ప్రతి మైన్‌ను వెతికి పట్టుకోవడం, దానిని సురక్షితంగా నిర్వీర్యం చేయడం అనేది ఒక క్లిష్టమైన ప్రక్రియ. ఒక్క మైన్ మిగిలినా చమురు ట్యాంకర్లు ఆ మార్గంలో రావడానికి భయపడతాయి. కాబట్టి 100 శాతం క్లియరెన్స్ ఇచ్చే వరకు హర్మూజ్ తెరవబడదు.

**ప్రపంచంపై ప్రభావం..**

హర్మూజ్ జలసంధి మూతపడడం అంటే ప్రపంచ ఇంధన సరఫరా గొలుసు విచ్ఛిన్నం కావడమే. భారత్ తన చమురు అవసరాల కోసం పశ్చిమాసియాపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. సరఫరా తగ్గితే పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ. 150 దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు బ్యారెల్‌కు వి120 నుంచి వి150 వరకు చేరే అవకాశం ఉంది. చమురు ధరల పెరుగుదల ప్రభావం నేరుగా రవాణా రంగంపై పడనుంది. అంతర్జాతీయ షిప్పింగ్ ఛార్జీలు 40% మేర పెరిగే సూచనలు ఉన్నాయి.

పెంటగాన్ అంచనాలు నిజమైతే, రాబోయే ఆరు నెలలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక 'అగ్నిపరీక్ష' లాంటిదే. చమురు కోసం ప్రత్యామ్నాయ మార్గాలు వెతకడం లేదా రష్యా వంటి ఇతర దేశాల నుంచి దిగుమతులు పెంచుకోవడం వంటి చర్యలను భారత్ ఇప్పటికే వేగవంతం చేసింది. ఏది ఏమైనా, హర్మూజ్ జలసంధిలోని ఆ కొన్ని మైన్స్ ఇప్పుడు ప్రపంచ శాంతిని మరియు సంపదను పణంగా పెట్టాయి.

# ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని శాసిస్తాయా!



ఆధునిక జీవనశైలిలో ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి పెరిగిపోయిన తర్వాత రకరకాల ఆహారపు అలవాట్లు మన ఆరోగ్యాన్ని శాసిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ఒక హాట్ డాగ్ తింటే మనిషి ఆయుష్షు 36 నిమిషాలు తగ్గుతుందనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. వినడానికి ఇది కొంచెం ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ మిచిగాన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు చేసిన ఒక లోతైన అధ్యయనం ఈ సంచలన విషయాలను వెల్లడించింది. మన నోటికి రుచిగా అనిపించే జంక్?ఫుడ్? మన శరీరంలోని అంతర్గత వ్యవస్థను ఎలా దెబ్బతీస్తాయో తాజా పరిశోధన స్పష్టం చేస్తోంది. కేవలం భయం పుట్టించడం కోసమే కాకుండా మనం తీసుకునే ఆహారం పట్ల అవగాహన పెంచడానికి ఈ గణాంకాలు ఎంతగానో తోడ్పడతాయి. నేచర్ ఫుడ్ పత్రికలో ప్రచురితమైన ఈ పరిశోధన ప్రకారం హాట్ డాగ్స్, బేకన్ ఇంకా సాసేజ్ వంటి ప్రాసెస్ చేసిన మాంసాలు ఆరోగ్యానికి అత్యంత హానికరమని తేలింది. వీటి తయారీలో రుచి కోసం ఇంకా ఎక్కువ కాలం నిల్వ ఉండటం కోసం సోడియం అంటే ఉప్పును, రకరకాల కొవ్వులను ఇంకా కొన్ని రకాల రసాయనాలను అధిక మొత్తంలో ఉపయోగిస్తారు. ఇవి రక్తపోటును పెంచడమే కాకుండా గుండె జబ్బులు, క్యాన్సర్ ఇంకా మధుమేహం వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పును వేగవంతం చేస్తాయి. ఒక హాట్ డాగ్ తిన్నప్పుడు శరీరానికి జరిగే నష్టాన్ని నిమిషాల్లో లెక్కిస్తే అది 36 నిమిషాల ఆయుష్షుతో సమానమని పరిశోధకులు అంచనా వేశారు. అంటే మనం తీసుకునే ప్రతి ఒక్క జంక్ ఫుడ్ ఐటమ్ మన జీవిత కాలాన్ని కొంచెం కొంచెంగా హరిస్తోందని దీని అర్థం. 36 నిమిషాలు అనేది వినడానికి భయంకరంగా ఉన్నప్పటికీ అప్పుడప్పుడు ఒక హాట్ డాగ్ తిన్నంత మాత్రాన ఆయుష్షు తగ్గిపోదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కానీ ఇలాంటి ప్రాసెస్ చేసిన ఆహారాలు తినడం అలవాటుగా మారితే మాత్రం దీర్ఘకాలంలో కోలుకోలేని నష్టం జరుగుతుంది. ఒకవేళ హాట్ డాగ్ వంటి ఆహారం తీసుకున్నప్పుడు దానితో పాటు పండ్లు ఇంకా ఆకుకూరలు వంటి పీచు పదార్థం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే కొంతవరకు ఆ ప్రభావాన్ని తగ్గించవచ్చు. పీచు పదార్థం శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. మనం ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పోషకాలు సమృద్ధిగా ఉండేలా చూసుకోవడమే ఆరోగ్యకరమైన జీవితానికి అసలైన రహస్యం. ఈ అధ్యయనం మనల్ని భయపెట్టడానికి కాదు కానీ మన ప్లేట్ లో మనం ఏం వేసుకుంటున్నామో గమనించమని గుర్తు చేస్తోంది. కేవలం ఒక్క పూట భోజనం కంటే మనం నిరంతరం పాటించే ఆహారపు అలవాట్లే మన ఆయుష్షును నిర్ణయిస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉంటూ ప్రకృతి సిద్ధంగా లభించే కూరగాయలు ఇంకా పండ్లకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కోల్పోయిన ఆయుష్షును మళ్ళీ తిరిగి పొందవచ్చు. ఆరోగ్యం అనేది మనం తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుంది కాబట్టి రుచి కంటే ఆరోగ్యానికే మొదటి స్థానం ఇవ్వాలి. సోషల్ మీడియాలో వచ్చే ఇటువంటి వార్తలను చూసి కంగారు పడకుండా మన జీవనశైలిని మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టాలి. అప్పుడే మనం నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించగలం. మన ప్రాణం మన చేతుల్లోనే ఉందనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలి.

# కొబ్బరినీరు తెగ తాగేస్తున్నారా?



దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్న వేళ, దాహార్తిని తీర్చుకోవడానికి ప్రతి ఒక్కరూ ప్రకృతి సిద్ధమైన పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో కొబ్బరి నీరు వేసవిలో అత్యంత ప్రాచుర్యం పొందిన సూపర్‌డ్రింక్ గా మారింది. సహజ ఎలక్ట్రోలైట్స్, శరీరానికి తక్షణ శక్తినిచ్చే గుణాలు ఉండటంతో ఫిట్‌నెస్ ప్రేమికుల నుండి సామాన్యుల వరకు అందరూ దీనిని అమృతంలా భావిస్తారు. చక్కెరతో కూడిన సాఫ్ట్ డ్రింక్స్‌కు ప్రత్యామ్నాయంగా ఇది అత్యుత్తమ ఎంపిక అనడంలో సందేహం లేదు. కొబ్బరి నీటిలో సుమారు 95 శాతం నీటితో పాటు పొటాషియం, సోడియం, మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి చెమట ద్వారా కోల్పోయిన ద్రవాలను భర్తీ చేయడానికి సహాయపడతాయి. అయితే, అతిగా తాగడం వల్ల రక్తంలో పొటాషియం స్థాయిలు విపరీతంగా పెరిగి 'హైపర్‌కలేమియా' అనే పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల కండరాల బలహీనత, గుండె కొట్టుకోవడంలో వేగం తగ్గడం లేదా పెరగడం వంటి అసమానతలు తలెత్తుతాయి. తీవ్రమైన సందర్భాల్లో ఇది గుండెపోటుకు కూడా దారితీయవచ్చు. అందుకే కొబ్బరి నీటిని మితంగా తీసుకోవడం ప్రాణావసరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డిఉూ) ప్రకారం, సాధారణ మంచి నీరే ప్రాథమిక హైడ్రేషన్ మూలంగా ఉండాలి తప్ప, కేవలం ఎలక్ట్రోలైట్ పానీయాలపైనే ఆధారపడకూడదు. అయితే, సహజ సిద్ధమైనది కదా అని అమితంగా కొబ్బరి నీరు తాగడం వల్ల ఊహించని ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరానికి అవసరమైన పోషకాలను కూడా మోతాదుకు మించి తీసుకుంటే అది విషంతో సమానమవుతుంది. కొబ్బరి నీటిలో ఉండే ఫర్మెంటబుల్ కార్బోహైడ్రేట్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీనివల్ల విరేచనాలు, కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. కొన్నిసార్లు ఇది సహజ విసర్జన కారకంగా పనిచేసి డీహైడ్రేషన్ ను తగ్గించడానికి బదులు మరింత పెంచుతుంది. అలాగే శరీరంలో పొటాషియం పెరిగి సోడియం తగ్గడం వల్ల తలనొప్పి, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా రక్తపోటు (బిపి) కోసం మందులు వాడేవారిలో ఇది రక్తపోటును అకస్మాత్తుగా తగ్గించి ప్రమాదకరంగా మారుతుంది. ఏది తిన్నా, తాగినా శరీరంలోని సహజ సమతుల్యత దెబ్బతినకుండా చూసుకోవడమే అసలైన ఆరోగ్యం. అందరికీ కొబ్బరి నీరు ఒకేలా పని చేయదు. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు ఉన్నవారు ఎంతో జాగ్రత్తగా ఉండాలి. మూత్రపిండాలు సరిగ్గా పనిచేయనప్పుడు శరీరంలోని అధిక పొటాషియాన్ని బయటకు పంపలేవు, ఇది ప్రాణాంతకంగా మారవచ్చు. అలాగే డయాబెటిస్ ఉన్నవారు, గుండె వ్యాధిగ్రస్తులు, చిన్నపిల్లలు ఇంకా వృద్ధులు వైద్యుల సలహా మేరకే దీనిని తీసుకోవాలి. తీవ్రమైన డీహైడ్రేషన్ లేదా వడదెబ్బ తగిలిన పరిస్థితుల్లో కొబ్బరి నీటి కంటే ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ మాత్రమే సమర్థవంతంగా పనిచేస్తుంది. కేవలం నేచురల్ డ్రింక్ అనే ముద్రతో దీనిని లీటర్ల కొద్దీ తాగడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ. సాధారణంగా ఆరోగ్యవంతులు రోజుకు ఒకటి లేదా రెండు గ్లాసుల కొబ్బరి నీరు తాగడం సురక్షితమని నిపుణులు సూచిస్తున్నారు. ఎండలో తిరిగినప్పుడు లేదా వ్యాయామం చేసినప్పుడు కలిగే అలసటను ఇది తక్షణమే తగ్గిస్తుంది. అయితే, తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో తాగకుండా గమనించుకోవాలి. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి మోతాదును నియంత్రించుకోవడం ఉత్తమం. మితంగా తీసుకుంటే కొబ్బరి నీరు నిజంగానే ఒక అద్భుతమైన వేసవి పానీయం. సరైన అవగాహనతో, సమతుల్యత పాటిస్తూ ఈ వేసవిని ఆరోగ్యంగా గడపండి.

# ఏ నూనె ఆరోగ్యానికి మంచిది?



మన వంటకాల్లో నూనె వాడకం రుచిని పెంచినప్పటికీ, అది మోతాదు మించితే ఆరోగ్యానికి ముప్పుగా మారుతుంది. ఐసీఎంఆర్ మార్గదర్శకాల ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 20 మిల్లీలీటర్లకు మించి నూనె వాడకూడదు. ముఖ్యంగా మరిగించిన నూనెను పదే పదే వాడటం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిఫైన్డ్ నూనెల కంటే గానుగ నూనెలు శ్రేయస్కరమని, విభిన్న రకాల నూనెలను మారుస్తూ వాడటం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వారు సూచిస్తున్నారు. సరైన మోతాదు, నాణ్యమైన నూనె ఎంపికే ఆరోగ్యానికి రక్షణ కవచం. మన భారతీయ వంటకాల్లో నూనె అనేది విడదీయలేని భాగం. ఉదయం టిఫిన్ నుండి రాత్రి భోజనం వరకు ప్రతి దశలోనూ నూనెను విరివిగా ఉపయోగిస్తాం. అయితే, రుచి కోసం మనం వాడుతున్న అధిక నూనె మన ప్రాణాల మీదకు తెచ్చే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా దేశంలో ఒక్కో వ్యక్తి ఏడాదికి సగటున 23.5 లీటర్ల నూనెను వాడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఐసీఎంఆర్ మార్గదర్శకాలు భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఎఅఓఖ) ప్రకారం, ఒక ఆరోగ్యవంతుడైన వ్యక్తి రోజుకు 20 మిల్లీలీటర్లకు మించి నూనె వాడకూడదు. అంటే దాదాపు నాలుగు టేబుల్ స్పూన్లు మాత్రమే. ఒకవేళ మీ కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే, నెలకు మీ నూనె వినియోగం గరిష్ఠంగా 4 లీటర్లకు మించకుండా చూసుకోవాలి. నూనె పూర్తిగా మానేయడం కూడా మంచిది కాదు, ఎందుకంటే విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి పోషకాలను శరీరం గ్రహించాలన్నా, శారీరక శ్రమకు అవసరమైన శక్తి లభించాలన్నా సరైన మోతాదులో కొవ్వు అవసరం. కానీ, మోతాదు మించితే మాత్రం రక్తనాళాల్లో పూడికలు, ఊబకాయం, అధిక రక్తపోటు వంటి గుండె జబ్బులకు దారి తీస్తుంది. మరిగించిన నూనె మళ్లీ వాడటం ప్రాణాంతకమా? మనం చేసే అతిపెద్ద తప్పు ఏమిటంటే.. ఒకసారి డీప్ ఫ్రై చేసిన నూనెను మళ్లీ మళ్లీ వేడి చేసి వాడటం. ఇలా పదే పదే మరిగించిన నూనెలో విషపూరిత రసాయనాలు ఏర్పడతాయి. ఇది కాలేయం దెబ్బతినడానికి క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పు పెరగడానికి కారణమవుతుందని ప్రముఖ పోషకాహార నిపుణులుహెచ్చరిస్తున్నారు. నూనె రంగు మారినా, జిగురుగా తయారైనా లేదా దుర్వాసన వచ్చినా దానిని వెంటనే పారేయడం ఉత్తమం. వేడి చేసినప్పుడు పొగ వస్తున్న నూనెను వాడటం వల్ల శరీరంలో ఆక్సీకరణ ప్రక్రియ పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. రిఫైన్డ్ ఆయిల్ వర్సెస్ కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్.. ఏది మేలు? నూనె నాణ్యత విషయంలో కోల్డ్ ప్రెస్డ్ (గానుగ) నూనెలు అత్యుత్తమమని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే వీటిలో రసాయనాలు ఉండవు, సహజ సిద్ధమైన యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అలాగే ఉంటాయి. రిఫైన్డ్ ఆయిల్ తయారీలో గింజలను అధిక వేడికి గురి చేయడం వల్ల అందులోని పోషక విలువలు తగ్గిపోతాయి.

# ముంబయిపై చెన్నై భారీ విజయం

## సంజు అజేయ శతకం

## విజృంభించిన అకీల్, నూర్



ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ అద్భుత విజయం నమోదు చేసింది. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై 103 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. సంజు శాంసన్ (101లి) అద్భుత శతకంతో కదంతొక్కగా, బౌలింగ్‌లో అకీల్ హోసేన్ (4/17) మాయ చేయడంతో చెన్నై సునాయాసంగా గెలుపొందింది. 208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. 11 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్ అకీల్ హోసేన్ ధాటికి ముంబై బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోయింది. సూర్యకుమార్ యాదవ్ (36), తిలక్ వర్మ (37) కాసేపు పోరాడినా, వీరిద్దరూ ఔటయ్యాక మిగతా బ్యాటర్లు చేతులెత్తేశారు. దీంతో ముంబై 19 ఓవర్లలో 104 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. చెన్నై బౌలర్లలో అకీల్ హోసేన్ 4 వికెట్లతో ముంబై పతనాన్ని శాసించగా, నూర్ అహ్మద్ రెండు వికెట్లు తీశాడు.అంతకుముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్‌కింగ్స్, నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజు శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి రుతురాజ్ గైక్వాడ్ (22), డెవాల్డ్ బ్రెవిస్ (21) నుంచి కొంత సహకారం లభించింది. ముంబై బౌలర్లలో గజన్‌ఫర్ రెండు వికెట్లు పడగొట్టాడు.

# ఆ నమ్మకమే నిలబెట్టింది



రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శన తనలో ఎలాంటి మార్పులు తీసుకురాలేదని సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ పేసర్ ప్రఫుల్ హింగే అన్నాడు. నెట్స్‌లో అభిషేక్‌శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్‌లకు బౌలింగ్ చేయడం ఎంతగానో కలిసొచ్చిందని తెలిపాడు. అరంగేట్ర మ్యాచ్‌లో మొదటి ఓవర్లోనే మూడు వికెట్లు తీసిన ప్రఫుల్.. ఐపీఎల్ చరిత్రలో ఈ ఘనత సాధించిన తొలి బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఒకేఒక్క మ్యాచ్‌తో ఐపీఎల్‌లో తనదైన ముద్ర వేసిన ప్రఫుల్.. 'ఈనాడు'తో తన అనుభవాల్ని పంచుకున్నాడు. "మొదట్లో సరైన సదుపాయాలు లేక.. అవకాశాలు రాక నన్ను నేను నిరూపించుకోడానికి చాలా కష్టపడ్డా. అవకాశాలు ఆలస్యంగా రావడంతో ఆత్మవిశ్వాసమూ సన్నగిల్లింది. కానీ సహనం.. పట్టుదల నన్ను ముందుకు నడిపించాయి. ఈ ప్రయాణంలో నా కుటుంబం మద్దతుగా నిలిచింది. నా శిక్షణ, కిట్, ప్రయాణ ఖర్చుల కోసం ఆర్థికంగా త్యాగాలు చేసింది. వారి నమ్మకమే నన్ను నిలబెట్టింది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఎంపికైనప్పుడు కల నిజమైంది. చాలా ఆనందంగా, గర్వంగా అనిపించింది. నా కష్టానికి లభించిన ప్రతిఫలంగా భావించా. రాజస్థాన్ రాయల్స్‌తో అరంగేట్ర మ్యాచ్‌లో తొలి ఓవర్ ఎప్పటికీ మరిచిపోలేను. గతంలో వైభవ్ సూర్యవంశీతో అండర్-23లో కలిసి ఆడా. అతను మొదటి బంతి నుంచే దాడి చేస్తాడని తెలుసు. కాబట్టి బౌన్సర్ వేసి ఔట్ చేయాలని ముందుగానే నిర్ణయించుకున్నా. అనుకున్నట్లే వికెట్ తీయడం ఎంతో ఆనందాన్నిచ్చింది. అదే ఓవర్లో ధ్రువ్ జురెల్, ప్రిటోరియస్ వికెట్లు తీయడం ఎక్కడలేని ఉత్సాహాన్నిచ్చింది. నెట్స్‌లో అభిషేక్, హెడ్, క్లాసెన్‌లకు బౌలింగ్ చేయడం నాకెంతో కలిసొచ్చింది. వారి దగ్గర చాలా నేర్చుకున్నా. వారంతా ప్రతి బంతిని బాదే రకం కాబట్టి మ్యాచ్ కంటే నెట్స్‌లో బౌలింగ్ చేయడమే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. రాజస్థాన్‌తో మ్యాచ్‌లో అద్భుతమైన గణాంకాలు నమోదు చేయడానికి ఇదే కారణం. నా ఆరాధ్య ఆటగాడు ప్యాట్ కమిన్స్. అతనితో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం గొప్ప అనుభూతిని అందిస్తుంది. 'ఆటను ఆస్వాదించు.. చిరునవ్వుతో ఆడు' అని కమిన్స్ నాకు చెప్పాడు. ఒకేఒక్క ఓవర్‌తో.. రాత్రికి రాత్రే స్టార్ అయ్యానని చాలామంది అంటున్నారు. కానీ నాలో ఎలాంటి మార్పు రాలేదు. మ్యాచ్‌కు ముందు ఎలా ఉన్నానో.. ఇప్పుడూ అలాగే ఉన్నా. ఎప్పటికీ పాత ప్రఫుల్ లాగే ఉంటా" అని అతను చెప్పాడు.



# త్రిష కృష్ణన్ 100 కోట్ల సామ్రాజ్యం: 25 ఏళ్ల సినీ ప్రస్థానంలో అరుదైన మైలురాయి!



దక్షిణాది సినీ పరిశ్రమలో -ఎవర్ గ్రీన్ క్వీన్-గా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ తన 25 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో కేవలం నటిగానే కాకుండా ఒక బ్రాండ్‌గా ఎదిగారు. ప్రస్తుతం త్రిష నికర ఆస్తి విలువ సుమారు 100 కోట్ల రూపాయలకు చేరుకోవడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 1999లో -జోడి- చిత్రంతో సహాయ నటిగా ప్రయాణం మొదలుపెట్టిన త్రిష.. నేటికీ అగ్ర కథానాయికగా కొనసాగుతూ తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. ఒక నటిగా ఇన్ని దశాబ్దాల పాటు తన క్రేజ్‌ను కాపాడుకుంటూ ఆర్థికంగా ఇంతటి ఉన్నత స్థితికి చేరుకోవడం ఆమె పట్టుదలకు నిదర్శనం. త్రిష ఆదాయ వనరులను పరిశీలిస్తే.. ఒక్కో సినిమాకు సుమారు 3 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. -పొన్నియిన్ సెల్వన్- వంటి భారీ విజయాల తర్వాత డిమాండ్ మరింత పెరిగింది. సినిమాలతో పాటు కార్పొరేట్ సంస్థల ప్రకటనల ద్వారా కూడా ఆమె భారీగానే ఆర్జిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. స్థిరమైన ఆదాయాన్ని గడించారు. ఈ సంపాదనను తెలివిగా వివిధ రంగాల్లో పెట్టుబడిగా మలిచారు. త్రిష ఆస్తిపాస్తుల్లో ప్రధానమైనవి హైదరాబాద్ - చెన్నైలలోని విలాసవంతమైన నివాసాలు. ముఖ్యంగా చెన్నైలోని ఆమె సొంత ఇల్లు అత్యంత ఖరీదైన ఇంటీరియర్స్‌తో సకల సౌకర్యాలతో కూడి ఉంది. దీని విలువ దాదాపు 10 కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా. ఇవే కాకుండా.. రియల్ ఎస్టేట్ రంగంలో కూడా భారీగా పెట్టుబడులు ఉన్నాయి. పలు నగరాల్లో విలువైన భూములు - వాణిజ్య సముదాయాల్లో భాగస్వామ్యం ఉండటం త్రిష ఆర్థిక భవిష్యత్తుకు మరింత భరోసాగా నిలిచాయి. విలాసవంతమైన జీవనశైలికి మారుపేరైన త్రిషకు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. గ్యారేజీలో బిఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, రేంజ్ రోవర్ వంటి ఖరీదైన కార్లు ఉన్నాయి. కేవలం భౌతిక సంపాదనే కాకుండా..జంతు సంరక్షణ .. పలు సేవా కార్యక్రమాల కోసం తన సంపాదనలో కొంత భాగాన్ని వెచ్చిస్తూ సమాజం విషయంలో తన బాధ్యతను చాటుకుంటున్నారు. త్రిష లైఫ్ స్టైల్ నేటి తరం యువ నటీమణులకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తోంది. వృత్తిపరమైన ఒడిదుడుకులు ఎదురైనా.. వ్యక్తిగత జీవితంలో ఎన్ని విమర్శలు వచ్చినా కుంగిపోకుండా తన కెరీర్‌ను విజయవంతంగా మలుచుకున్న త్రిష ప్రయాణం స్ఫూర్తిదాయకం. 40 ఏళ్ల వయసులోనూ కుర్ర హీరోయిన్లకు పోటీనిస్తూ..మరోవైపు వంద కోట్ల ఆస్తిని కూడబెట్టడం చూస్తుటే.. త్రిష వృత్తి గతంగా చూపే అంకితభావానికి ప్రతిఫలం.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com